ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

జయశంకర్ భూపాలపల్లి

ములుగు

బుధవారం 4 సెప్టెంబరు 2024



వరద నష్టంపై మానుకోట కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న సీఎం



మరిపెడ మండలం పురుషోత్తమయగూడెం వద్ద కోతకు గురైన రోడ్డును పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి, సీతక్క, ఎమ్మెల్యేలు



సీతారాంతండాలో బాధిత కుటుంబంలోని చిన్నారితో మాట్లాడుతున్న రేవంత్

అధైర్యం వద్దు.. అండగా ఉంటాం..

- అధికారుల అప్రమత్తతతో ఆస్తి, ప్రాణ నష్టాన్ని తగ్గించగలిగాం
- మానుకోట జిల్లాలో 30వేల ఎకరాల్లో పంట నష్టం
- ప్రతీ ఎకరాకు రూ.10వేల పరిహారమిస్తాం
- మూడు తండాల తరలింపుతో మోడల్ కాలనీ
- సీతారాంతండా పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి
- మహబూబాబాద్ కలెక్టరేట్‌లో వరద నష్టంపై సమీక్ష

మహబూబాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వర్షం సృష్టించిన బీభత్సంతో ఎవరూ అధైర్యపడొద్దని.. తమ ప్రజాప్రభుత్వం అండగా ఉంటుందని, మహబూబాబాద్ జిల్లాలో 28 సెంటిమీటర్ల వర్షం పడిందని, జలప్రళయం వచ్చినా అధికారులు అప్రమత్త వ్యవహరించి ఆస్తి, ప్రాణనష్టాన్ని కొంత మేరకు తగ్గించగలిగారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని సీతారాంతండాను మంగళవారం సందర్శించిన ఆయన బాధితులతో మాట్లాడారు. ప్రభుత్వం అండగా ఉంటుందని వారికి భరోసా కల్పించారు. తొలుత పురుషోత్తమయగూడెం 365 జాతీయ రహదారిపై 1500 మీటర్ల మేరకు కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలించి.. వాగు ఉధృతితో ఇసుకమేటలు వేసిన ప్రాంతాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహబూబాబాద్ కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి సీతక్కలతో కలిసి వర్షం, వరద నష్టంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ మానుకోట జిల్లా వ్యాప్తంగా 30వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ఇక వరద బీభత్సంలోనూ నిరంతరం సహాయక చర్యల్లో పాల్గొన్న రెవెన్యూ, పోలీస్, విద్యుత్, వైద్య అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. వరద ముంపునకు గురైన సీతారాంతండా వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించిన సీరోలు ఎస్సై నగేష్ అభినందనీయుడన్నారు. ప్రకృతి వైపరీత్యం వల్ల జిల్లాలో నలుగురు మృతి చెందగా.. వారిలో ఇద్దరు మహబూబాబాద్ జిల్లా వారైతే.. మరో ఇద్దరు పక్క జిల్లా అయిన ఖమ్మానికి చెందిన వారని వివరించారు. అలాగే 215 పశువులు చనిపోయాయని, 45 ట్యాంక్‌లు, మూడు పక్కాఇళ్లు, 15 కచ్చ ఇళ్లు కూలిపోయాయని, మరో 96 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని, 125 గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడిందని, 680 మందిని వరద ముంపుప్రాంతాల నుంచి తప్పించి వసతి కల్పించామని వెల్లడించారు. చనిపోయిన ప్రతీ వ్యక్తి కుటుంబానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నట్లు ప్రకటించారు. పురుషోత్తమయగూడెం ఆకేరువాగులో కారు గల్లంతయి మృతి చెందిన యువ శాస్త్రవేత్త నూనావత్ అశ్విని, ఆమె తండ్రి మోతీలాల్ వారి స్వగ్రామం ఖమ్మం జిల్లా కారేపల్లి గంగారం తండాకు వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి, ఇందిరమ్మ ఇల్లు కట్టించాలని ఆదేశించామన్నారు.



పొలాల మీదుగా కాలినడకన సీతారాంతండాకు వస్తున్న సీఎం, మంత్రులు

మూడుతండాల తరలింపుతో మోడల్ కాలనీ..

ప్రతీసారి వరద ముంపునకు గురయ్యే పురుషోత్తమయగూడెం శివారు సీతారాంతండాతో పాటు మరో రెండు తండాలను సురక్షిత ప్రాంతానికి తరలించి, ఒక మోడల్ కాలనీగా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయా తండాల వారికి ప్రత్యామ్నాయంగా ఇందిరమ్మ ఇళ్లు, పట్టాలు ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశిస్తున్నట్లు ప్రకటించారు. జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా నష్టపోయిన ప్రతీ ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. మృతి చెందిన పశువులకు రూ.50వేలు, మేకలు, గొర్రెలకు రూ.5వేల చొప్పున యజమానులకు నష్టపరిహారం అందజేయాలన్నారు. మహబూబాబాద్ మునిసిపాలిటీ పరిధిలోనే రూ.13కోట్ల నష్టం వాటిల్లిందని, ఇప్పటి వరకు జరిగిన విపత్తును ఎదుర్కోవడం ఒకటైతే.. ఇక ముందు మరేవిధమైన ఇబ్బందులు కలుగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. మునిసిపల్, పంచాయతీ రాజ్, వైద్య, రెవెన్యూ అధికారులు ముంపునకు గురైన ప్రాంతాల్లోని ఇండ్లు, రోడ్లు శుభ్రం చేయడానికి నల్లాలు, ట్యాంకర్ల ద్వార నీరందించాలని చెప్పారు. దోమల వ్యాప్తి, అంటు వ్యాధులు రాకుండా ఆరోగ్యశాఖ ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతులను చేయాలని రేవంత్‌రెడ్డి సూచించారు. ఎక్కడైతే నష్టం జరిగిందో ఆ ప్రాంతాల పునరుద్ధరణకు అవసరమైతే

మిగతా 7వ పేజీలో..



రాజకీయ లబ్ధి కోసమే బీఆర్ఎస్ విమర్శలు

రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 3 : వర్షాలతో రైతుల పంట దెబ్బతిని, ప్రజలు కష్టాల్లో ఉంటే ఆదుకునేది పోయి రాజకీయ లబ్ధి కోసం బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్, రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. మహబూబాబాద్ కలెక్టరేట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా గంటల్లోనే 42సెంటీమీటర్ల వర్షం కురిసిందని, ఇంతటి విపత్తుఎన్నడూ చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎప్పటికప్పుడు సూచనలు చేస్తూ, జిల్లాలను పర్యటిస్తూ అధికారులను అప్రమత్తం చేస్తున్నారని, రోడ్డు మార్గంలో ప్రయాణిస్తూ నష్టాన్ని పరిశీలించి ప్రజలకు ఓదార్పునిస్తూ అండగా నిలుస్తున్నారని, అలాంటి నాయకుడిపై ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. మంచి సలహాలు, సూచనలిస్తే స్వీకరిస్తామని, విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ దగ్గర రూ.వేల కోట్లు ఉన్నాయని, అందులో నుంచి రూ.వెయ్యి లేదా రూ.రెండు వేల కోట్లు ఇస్తే తాను కొంతకలిపి నష్ట పోయిన ప్రజల అవసరాలు తీరుస్తామన్నారు. ధ్వంసమైన రోడ్లు, ఇతరత్రా పనులను సత్వరమే మరమ్మతులు చేయించాలన్నారు. అధికారులంతా అప్రమత్తంగా ఉండి సమన్వయంతో పని చేయడం వల్ల తక్కువ నష్టం జరిగిందని అహర్నిశలు శ్రమించిన జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు.



సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి సీతక్క



విపత్కర సమయాల్లో అధికారులు అంతా అప్రమత్తంగా ఉండి సేవలందించాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎప్పటికప్పుడు అందరినీ అప్రమత్తం చేశారని దాంతో నష్టం కొంతమేర తగ్గిందన్నారు. మానుకోట జిల్లాలో వర్షాలతో ఇళ్లలోకి నీరు చేరితే, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారని, వర్షాలతో నష్టం జరిగిన జిల్లాలకు తక్షణ సాయం కింద సీఎం రేవంత్‌రెడ్డి రూ.5కోట్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. ధ్వంసమైన రోడ్ల పునరుద్ధరణ కోసం పనులను వేగవంతం చేయాలని సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. తొలుత జిల్లాలో వర్షాలతో జరిగిన నష్టం, తీసుకు న్న సహాయక చర్యలపై కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్ ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ పోరిక బలరాంనాయక్, ప్రభుత్వవిప్ జాటోతు రాంచంద్రునాయక్, ఎమ్మెల్యేలు భూక్య మురళీనాయక్, కోరం కనకయ్య, యశస్వినిరెడ్డి, కేఆర్.నాగరాజు, గండ్ర సత్యనారాయణ, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, ఎం.డేవిడ్, ఆర్డీవో అలివేలు పాల్గొన్నారు. మానుకోట మునిసిపల్ పరిధిలో దెబ్బతిన్న రోడ్లు, డ్రెయినేజీలు, విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ, నాలాల ఏర్పాటుకు రూ.15 కోట్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మునిసిపల్ చైర్మన్ రాంమోహన్ రెడ్డి, వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, ఫ్లోర్ లీడర్ చిట్యాల జనార్దన్ వినతిపత్రం అందించారు.

నిరంతరాయంగా

- తాళ్లపూసపల్లిలో రైల్వే ట్రాక్ మరమ్మతులు పూర్తి
- గూడ్స్‌రైలుతో ట్రయల్‌రన్ నిర్వహణ
- ఇంటికన్నె వద్ద యుద్ధప్రాతిపదికన చర్యలు
- పునరుద్ధరణ పనుల్లో వెయ్యి మందికిపైగా సిబ్బంది

వివరాలు 7లో...



ఇంటికన్నె సమీపంలో రైల్వే ట్రాక్ వేలాడిన ప్రాంతంలో జోరుగా కొనసాగుతున్న మరమ్మతు పనులు

అంతర్రాష్ట్ర రాకపోకలు బంద్

జలదిగ్బంధంలో రహదారులు



వాజేడు-గుమ్మడిదొడ్డి ప్రధాన రహదారిని ముంచెత్తడంతో పోలీసులు పహారా

వాజేడు, సెప్టెంబరు 3: తెలంగాణ-చత్తీస్‌గఢ్ రాష్ట్రాల మధ్య మంగళవారం రాకపోకలు నిలిచిపోయాయి. గోదావరికి వరద ఉధృతి పెరగటంతో 163వ జాతీయ రహదారి టేకులగుడెం వద్ద రేగుమాగు గండికి నీటి ప్రవాహం

మిగతా 8వ పేజీలో...



ఆక్రమణకు గురైన భూపాలపల్లిలోని గోరంట్ల కుంట శిఖం భూమి

- కబ్జా కోరల్లో భూములు
- భూపాలపల్లిలో మాయమవుతున్న చెరువులు, పంట కాల్వలు
- ప్లాట్లుగా అమ్ముకుంటున్న అక్రమార్కులు
- ఆక్రమణలను కాపాడుకోవడానికి పాడరాని పాట్లు
- 'భూద్రా' వస్తేనే కట్టడి చేయొచ్చంటున్న జనం

శిఖం.. ఖతం

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 3: జిల్లా కేంద్రం భూపాలపల్లిలో కబ్జాల పర్వం కొనసాగుతోంది. చెరువులు, పంట కాల్వలు ఒక్కొ క్కటిగా మాయమవుతున్నాయి. చూస్తూ చూస్తుండగానే వెంచర్లు, కట్టడాలు వెలుస్తున్నాయి. కలెక్టరేట్‌కు కూత వేటు దూరంలోని గోరంట్లకుంట శిఖం భూములు పూర్తిగా అన్యాక్రాంతమయ్యాయి. సర్వే నంబర్ 209లోని 22.19 ఎకరాల శిఖం భూమిని అక్రమార్కులు కాజేశారనే ఆరోపణలు ఉన్నాయి. వెంచర్లు, సాగు భూములు చేయడంతోపాటు మాజీ ఎమ్మెల్యే ఏకంగా గుడి కట్టి, దానికి అనుబంధంగా కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారని ఆయనపై ఆరోపణలు వచ్చాయి. అలాగే మునిసిపల్ కౌన్సిలర్ ఒకరు శిఖం భూమిలో వెంచర్ వేసి ప్లాట్స్‌గా అమ్మేసుకున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. అలాగే భాస్కర్‌గడ్డ వద్ద 255, 256 సర్వే నంబర్లలో ఉన్న బొబ్బగట్టు మాటు పంట కాల్వలను పలువురు అక్రమార్కులు ధ్వంసం చేసి వెంచర్ వేశారని తెలుస్తోంది.

జిల్లా కేంద్రంలోని గోరంట్ల కుంట ఉన్న సర్వే నంబర్ 209లోని 22.19 ఎకరాల్లో 1.32 గుంటలను అప్పటి అధికార పార్టీ కౌన్సిలర్, ఆయన అనుచరులు కబ్జా చేశారనే ఆరోణలు ఉన్నాయి. 209 సర్వే నంబర్‌ను 213 నంబర్‌గా నాలా కన్వర్షన్ చేసుకున్నారని, ఆక్రమించిన భూమిని వెంచర్‌గా చేసి ప్లాట్స్ అమ్మేసుకున్నారని తెలుస్తోంది. విచిత్రం ఏమిటంటే.. ఈ వెంచర్‌లో విద్యుత్‌శాఖ అధికారులు కరెంటు కనెక్షన్ కూడా సమకూర్చారు. అలాగే మరో 15 గుంటల భూమిని ఆక్రమణదారులు ఓపెన్ ప్లాట్స్‌గా అమ్ముకొని జేబులు నింపుకున్నారు. మరికొందరు 1.25 ఎకరాల చెరువు భూమి ఆక్ర మించి వ్యవసాయం చేస్తున్నారు. అంతేకాదు.. తమ కబ్జాలో ఉన్న భూములను కాపాడుకోవడానికి అక్రమార్కులు అనేక దారులు వెతుక్కుంటు న్నారని సమాచారం. గతంలో ఉన్న పార్టీ కండువాను తీసి పారేసి.. ప్రస్తుత అధికార పార్టీ పంచాన చేరారనే విమ ర్శలు వస్తున్నాయి. గోరంట్ల కుంట ఆక్రమ ణలకు గురికావడం వెనుక భూపాలపల్లి మండలంలో గతంలో పనిచేసిన తహ సీల్దార్ పాత్ర ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. చెరువు శిఖానికి చెందిన 209 సర్వే నంబర్‌లోని 1.32 ఎకరాల భూమిని 213 సర్వే నంబర్‌గా నాలా కన్వర్షన్ చేసి అక్రమార్కులకు ఆయన సహకరించారనే వాదనలు ఉన్నాయి.

హైకోర్టు మెట్లెక్కిన ఇరిగేషన్ శాఖ

మంజూర్‌నగర్‌లోని గోరంట్ల కుంట శిఖం భూమిలో జరిగిన అక్రమాలపై నీటి పారుదలశాఖ, సర్వే ల్యాండ్, మునిసిపాలిటీ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించారు. ఇక్కడ అక్రమాలు చోటు చేసుకున్నట్లు తేల్చారు. చెరువు శిఖం హద్దులను కుడా ఏర్పాటు చేశారు. శిఖం భూమిలో వెంచర్, వ్యవసాయ భూమి, వెంకటేశ్వర ఆలయం నిర్మాణం, కాంప్లెక్స్ కట్టడంతో పాటు అప్పటి ఎమ్మెల్యే కాంప్లెక్స్, ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ నిర్మాణాలు ఉన్నట్లు గుర్తించారు. వీటిలో ఆలయం, కాంప్లెక్స్ నిర్మాణాలు కోర్టు పరిధిలో ఉండటం, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లు ప్రభుత్వ నిర్మాణాలు కావడంతో అధికారులు వీటిపై ఎలాంటి నిర్ణయాలు తీసుకునే పరిస్థితి లేదు. శిఖంలో వెలిసిన ఇతర కట్టడాలపై చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వలంటూ నీటిపారుదల శాఖ అధికారులు ఈ ఏడాది జనవరి 29న అప్పటి కలెక్టర్ భవేష్ మిశ్రాకు లేఖ రాశారు. ఈ ఆక్రమణలపై ఆయన ఏమీ తేల్చకపోవడంతో చేసేదేమీ లేక ఇరిగేషన్ అధికారులు ఏప్రిల్ 26న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

'భూద్రా' రావాలంటున్న జనం

హైదారాబాద్‌లో ధ్వంసమవుతున్న చెరువులను పరిరక్షించేం దుకు రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హైడ్రా (హైదారాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసిస్ట్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్)పై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోనూ అలాంటి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. హైడ్రా మాదిరి భూద్రా (డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసిస్ట్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్) ఏర్పాటు చేసి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



ఆక్రమణలను తొలగిస్తాం...

- రాహుల్‌శర్మ, జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్

చెరువులను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అక్రమార్కులను ఉపేక్షించేది లేదు. అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు వెనుకాడం. దీని కార్యాచరణపై ఎస్పీతో చర్చిస్తాను.

మట్టి గణపతులనే పూజించాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 3: మట్టి గణపతి విగ్రహాలను పూజించి, తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. మట్టి విగ్రహాలపై అవగాహన కల్పిస్తూ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ కృత్రిమ రంగులు, రసాయనాలతో కూడిన విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేయడం వల్ల జలవనరులు కాలుష్యమయం అవుతున్నాయని అన్నారు. మట్టితో చేసిన గణపతులను పూజించి కాలుషితం కాకుండా చెరువులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈనెల 6 నుంచి 8 వరకు జిల్లాలోని ప్రధాన కూడళ్లలో 8 అంగుళాల మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జడ్పీ సీఈవో విజయలక్ష్మి, కాలుష్య నియంత్రణ మండలి ఏఈ సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిని బలితీసుకున్న బొగ్గులారీ

- ఆర్టీసీ బస్సును ఢీ కొట్టిన ఘటనలో ముగ్గురి మృతి
- మృతుల్లో తొర్రూరుకు చెందిన దంపతులు, పాలకుర్తికి చెందిన మహిళ
- జనగామ జిల్లా వావిలాలలో ఘటన



మృతి చెందిన హేమానీ, బుజ్జి, నసీమా

వివరాలు 7వ పేజీలో..



బొగ్గు లారీ ఢీ కొట్టడంతో దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు

కారోబార్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీకాంత్



సాదుల శ్రీకాంత్

మల్హర్, సెప్టెంబరు 3 : తెలంగాణ స్టేట్ గ్రామపంచాయతీ కారోబార్స్, సిబ్బంది అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా సాదుల శ్రీకాంత్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి సమావేశంలో ఈమేరకు ఎన్నుకున్నారు. తన ఎన్నికకు సహకరించిన వారందరికీ శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సమయంలో గ్రామపంచాయతీ సిబ్బందికి ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.



శాస్త్రవేత్తలకు ఉత్తమ అవార్డులు, పురస్కారాలు

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 3: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం 10వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం హైదరాబాద్‌లో ఉత్తమ శాస్త్రవేత్తలకు అవార్డులు అందజేశారు. ఇందులో వరంగల్ వ్యవసాయ పరిశోధనా స్థానంలో పనిచేస్తున్న ఇద్దరు శాస్త్రవేత్తలు, ఒక సీనియర్ అసిస్టెంట్‌కు అవార్డులు దక్కాయి. ఆ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ బీజే రావు, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ వైస్ చైర్మన్ ఎం.రఘునందన్ చేతుల మీదుగా వారు అవార్డులను అందుకున్నారు. అవార్డు గ్రహీతలు ఐదేళ్లుగా అపరాల పంటలో నూతన కంది వంగడాలు, పంటలలో పురోగతి, విత్తనోత్పత్తిలో మెరుగైన కృషి చేసినందుకు శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.సంధ్యాకిషోర్ మండవ వెంకటరామయ్య ఉత్తమ శాస్త్రవేత్త అవార్డును అందుకున్నారు. వరిలో నూతన వంగడాల రూపకల్పనలో భాగస్వామ్యం అవడంతోపాటు వరిలో వచ్చే చీడపీడల నివారణ నిర్మూలనకు ఆధునిక పద్ధతిలో రూపొందించడంలో కీలక ప్రాత పోషించినందుకు వరి విభాగంలో కీటక శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.ఓంప్రకాష్ ఉత్తమశాస్త్రవేత్త అవార్డును అందుకున్నారు. అలాగే వరంగల్ వ్యవసాయ ప్రాంతీయ పరిశోధనా స్థానంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న భూక్యా రమేష్ ఉత్తమ సేవా అవార్డును అందుకున్నారు.


అవార్డు అందుకుంటున్న సీనియర్ అసిస్టెంట్ రమేష్, ఓంప్రకాష్, సంధ్యాకిషోర్




డిగ్రీ విద్యార్థులకు ఆర్‌బిఐ ఆధ్వర్యంలో క్విజ్ పోటీ

పోస్టర్ ఆవిష్కరించిన కేయూ రిజిస్ట్రార్, ఆర్‌బిఐ అధికారి

కేయూక్యాంపస్, సెప్టెంబరు 3: డిగ్రీ విద్యార్థులకు రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా సువర్ణావకాశాన్ని కల్పించింది. క్విజ్‌లో పాల్గొని రూ.10 లక్షలు మొదటి, రూ.8లక్షలు రెండో బహుమతి, అలాగే రూ.6లక్షలు మూడో బహుమతిగా గెలుచుకునే బంపర్ ఆఫర్‌ను వెల్లడించింది. ఈ మేరకు మంగళవారం కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, ఆర్‌బీఐ అధికారి మహ్మద్ అలీ బాబాలు రిజిస్ట్రార్ చాంబర్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. వర్సిటీ పరిధిలో డిగ్రీ చదువుతూ, 25 ఏళ్ల వయస్సు కలిగిన యువతీ, యువకులు క్విజ్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు క్యూఆర్ కోడ్ ద్వారా ఇద్దరు కలిసి గ్రూపుగా వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. క్విజ్ పోటీలు జాతీయ స్థాయిలో నాలుగు రౌండ్‌లుగా జరుగుతాయని తెలిపారు. మొదటి రౌండ్ ఆన్‌లైన్‌లో ఉంటుందని వెల్లడించారు. మొదటి రౌండ్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా రెండో రౌండ్‌కు అర్హత సాధిస్తారని, అయితే రెండో రౌండ్ రాష్ట్రస్థాయిలో జరుగుతోందని పేర్కొన్నారు. అలాగే మూడో రౌండ్ జోనల్ స్థాయిలో జరుగుతోందని వెల్లడించారు. దీనిలో అత్యున్నత ప్రతిభ చూపిన వారికి జాతీయస్థాయిలో నాలుగో రౌండ్ జరుగుతుందని వివరించారు. 2, 3, 4వ రౌండ్‌లు ఆఫ్‌లైన్‌లో జరుగుతాయని, ఆయా రౌండ్‌లకు ఎంపికైన వారికి రవాణా, భోజనం, ఇతర ఖర్చులను ఆర్‌బీఐ భరిస్తుందని పేర్కొన్నారు. కాగా, పోటీల్లో పాల్గొన్న వారందరికీ ఆర్‌బీఐ తరుపున సర్టిఫికెట్లను అందచేస్తారని తెలిపారు. ఇతర వివరాలకు www.rbi.org.inలో చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఐ అధికారి మహ్మద్ అలీబాబా, లీడ్ బ్యాంకు ఆఫీసర్ హవేలీరాజు, ఫైనాన్సియల్ లిటరసీ క్రెడిట్ కౌన్సిలర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


క్విజ్ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి, అధికారులు











అధైర్యం వద్దు.. అండగా ఉంటాం

(5వ పేజీ తరువాయి)

సమీప ప్రాంతాల రెవెన్యూ, పోలీసులను రప్పించి, రంగంలోకి దింపాలన్నారు. ఎక్కడైతే ప్రమాదాలు, వరదల నష్టం జరుగుతుందో ఆయా ప్రాంతాలను గుర్తించి బ్లూబుక్ తయారు చేసి కలెక్టరేట్‌లో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ముందుముందు ఇలాంటి విపత్తులు ఏర్పడే అవకాశం ఉంటే అధికారులు మారినా.. ఆ బ్లూబుక్‌లోని సమాచారం ద్వారా చరిత్ర పునరావృతం కాకుండా జాగ్రత్తపడే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాకు చెందిన మంత్రులు, ఇన్‌చార్జ్ మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రజల మధ్యనే ఉండి ప్రజల కష్టనష్టాలను తెలుసుకుని అధికారులకు వివరించి అన్ని విధాలుగా ఆదుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. తమ ప్రభుత్వం బురద.. వరద రాజకీయాలు చేయదని, చిత్తశుద్ధితో పనిచేస్తుందని చెప్పారు. స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు వరద బాధితుల సాయం కోసం ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.



సీతారాంతండాలో వరద బాధితులతో మాట్లాడుతున్నసీఎం రేవంత్‌రెడ్డి

మానుకోటలోనూ హైడ్రా తరహా చర్యలకు ఆదేశం

మహబూబాబాద్ జిల్లాలో ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటలు, నాలాలు కబ్జా చేసి చేపట్టిన నిర్మాణాలను కూల్చివేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో అక్రమణల కూల్చివేతకు శ్రీకారం చుట్టిన హైడ్రా తరహాలోనే ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ నాలా చెరువులను ఆక్రమిస్తే కూల్చివేయడానికి కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నామని వెల్లడించారు. చెరువులు, నాలాలు, బఫర్‌జోన్‌ల ఆక్రమణల వల్లనే భారీ వర్షాలు చోటు చేసుకున్నప్పుడు వరద ముంపుతో తీవ్రనష్టం వాటిల్లుతుందన్నారు. రాష్ట్రమంతా చెరువులు, నాలాల ఆక్రమణలపై స్పెషల్ డ్రైవ్‌లు చేపడుతామని చెప్పారు. ప్రకృతిని చెరబట్టాలని చూస్తే ప్రకృతి ప్రకోపాన్ని చూడాల్సి వస్తుందని స్పష్టం చేశారు. ఉత్తరాఖండ్, తెలంగాణ, విజయవాడ, హైదరాబాద్ ఎక్కడైనా సరే ప్రకృతిమీద దాడిచేస్తే తప్పకుండా దుష్ఫలితాలు చూడాల్సి వస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆక్రమణలకు సంబంధించి హైకోర్టు ఇతరత్రా ఏ కోర్టుల్లో కేసులు ఉన్నా.. చట్టపరంగా, న్యాయపరంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూములు, కుంటలు, చెరువులను ఆక్రమించిన భూ కబ్జాదారులు ఎంతటి వారైనా వదిలేది లేదని, ఎంతటి ఒత్తిడి వచ్చినా.. వెనక్కి తగ్గేదే లేదని తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని పునరుద్ఘాటించారు. అక్రమంగా కట్టడాలు చేపట్టి ఉంటే వెంటనే స్వచ్ఛందంగా ప్రభుత్వానికి అప్పగించాలని కోరారు. లేని పక్షంలో తామే చర్యలు తీసుకుని కూల్చివేయిస్తామన్నారు. చెరువులు, నాలలు ఆక్రమణలకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్షలో మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వవిప్ జాటోతు రాంచంద్రునాయక్, ఎమ్మెల్యేలు భూక్య మురళీనాయక్, మామిడాల యశస్విని‌రెడ్డి కోరం కనకయ్య, కేఆర్.నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, ఎం.డేవిడ్ పాల్గొన్నారు.

సీతారాంతండా బాధితులకు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అండ



సీఎంకు తన జీతం చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

మరిపెడ మండలం తండాధర్మారం శివారు సీతారాం తాండా ముంపు బాధిత కుటుంబాల సహార్థం కోసం పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తన ఒకనెల వేతనం రూ.2.75 లక్షలను విరాళంగా ప్రకటించారు. ఈ సందర్భంగా సీతారాంతాండాలో సీఎం రేవంత్‌రెడ్డికి విరాళానికి సంబంధించిన చెక్కును మల్లన్న అందచేశారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఎస్ఈలు కృష్ణారెడ్డి, సురేందర్, డీఈఈ అనూష, శ్రీనివాస్, మరిపెడ తహసీల్దార్ సైదులు, ఎంపీడీవో విజయ, ఎంపీవో సోమ్లానాయక్ పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న విద్యార్థిని

కిడ్డీబ్యాంకులో దాచుకున్న రూ.3వేలను సీఎంకు అందజేసిన సాయిసింధు

మహబూబాబాద్ టౌన్ : వరదలో మహబూబాబాద్ జిల్లా అతలాకుతలమైన వేళ మహబూబాబాద్ పట్టణానికి చెందిన పదో తరగతి విద్యార్థిని చలించిపోయింది. తన తల్లిదండ్రులు పాకెట్ మనీగా ఇవ్వగా కిడ్డీ బ్యాంకులో దాచుకున్న రూ.3వేలను వరద బాధితుల సహాయార్థం అందించి పెద్దమనుసును చాటుకుంది. మహబూబాబాద్ పట్టణానికి చెందిన ముత్యాల గీతవాణి- ప్రవీణ్‌కుమార్ దంపతుల కుమార్తె సాయిసింధు స్థానిక ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన జిల్లావాసులకు అండగా ఉండేందుకు తాను దాచుకున్న డబ్బు రూ.3వేలను ముఖ్యమంత్రి సహాయ నిధికి అందించేందుకు గాను మంగళవారం మానుకోటకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి ఇచ్చింది. దీంతో సీఎం సింధును అభినందించారు.



సీఎం సహాయనిధి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రూ.3వేలను అందిస్తున్న చిన్నారి సాయిసింధు

శరవేగంగా జాతీయ రహదారి మరమ్మతులు



శరవేగంగా సాగుతున్న జాతీయ రహదారి మరమ్మతు పనులు



వరద ఉధృతికి పాడైన జాతీయ రహదారిని పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

మరిపెడ, సెప్టెంబరు 3 : భారీ వర్షాలతో ఆకేరు నది వరద ఉధృతితో మరిపెడ మండలం పీఎస్‌గూడెం దగ్గర పాడైన 365 జాతీయ రహదారి పునరుద్ధరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పనులను మంగళవారం సీతారాంనాయక్‌తండాకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించారు. పునరుద్ధరణ పనులు తాత్కలికంగా చేపట్టినప్పటికి మళ్లీమళ్లీ ఇలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు పకడ్బందీ, పక్కా ప్రణాళికలతో నివేదికలు తయారు చేయాలని సూచించారు. జిల్లా అధికార యంత్రాం గం పీఎస్ గూడెం బ్రిడ్జి దగ్గర మూడు ప్రొక్లయినర్లను ఏర్పాటు చేసి, పనులు నిర్వహిస్తున్నారు. రెండు రోజుల్లో పనులు పూర్తి చేసి రోడ్డు మార్గం పునరుద్ధరించేలా పనులు జరుగుతున్నాయి.

సీరోలు ఎస్సై నగేష్‌కు సీఎం సత్కారం



సీరోలు ఎస్సై నగేష్‌ను సత్కరిస్తున్న సీఎం, మంత్రులు

సీరోలు , సెప్టెంబరు 3 : వరదలతో నీట మునిగిన సీతారాంతండా ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలించిన సీరోలు ఎస్సై నగేష్ సేవలు భేష్ అని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. మహబూబాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించిన సీఎం సుమారు 100 మంది తండావాసులను సీరోలు ఎస్సై నగేష్ తన సిబ్బందితో కలిసి సురక్షిత ప్రాంతాలకు తరలించారని, ఈ క్రమంలో నడవలేని స్థితిలో ఉన్న 60 ఏళ్ల వృద్ధురాలిని కావడికి జోలెకట్టి స్వయాంగా ఆయన కావడి మోసి సురక్షిత ప్రాంతానికి తరలించి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మంత్రులు పొంగులేటి, సీతక్కతో కలిసి నగేష్‌ను సత్కరించారు.

సీఎం పర్యటన సాగిందిలా..

మరిపెడ, సెప్టెంబరు 3 : మరిపెడ మండలంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన 32నిమిషాల పాటు కొనసాగింది. ఖమ్మం నుంచి రోడ్డుమార్గంలో మ ధ్యాహ్నం 12.54నిమిషాలకు సీతారాంతండా స్టేజీకి చేరు కున్న ఆయన తొలుత మంత్రులు, అధికారులతో కలిసి ధ్వంసమైన జాతీయ రహదారిని పరిశీలించారు. అక్కడి నుంచి కాలినడకన 1.03 నిమిషాలకు సీతారాంతండాకు చేరుకున్నారు. 10నిమిషాల పాటు పలువురు బాధితుల ఇళ్లకు వెళ్లి జరిగిన నష్టం గురించి తెలుసుకున్నారు. రోదిస్తున్న బాధిత కుటుంబాల వారిని ఓదార్చారు. 1.13 నిమిషాలకు బాధిత కుటుబాలను ఉద్దేశించి 11 నిమిషాలు వారితో మాట్లాడారు. 1.26 నిమిషాలకు కాన్వాయ్ ద్వారా మహబూబాబాద్ కలెక్టరేట్‌కు బయలుదేరి వెళ్లారు. 1:45 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకున్న సీఎం ఫొటోప్రదర్శన తిలకించి 1:50 గంటలకు సమీక్ష ప్రారంభించారు. 2:35 గంటలకు సమీక్ష ముగించుకుని వెళ్లిపోయారు.

నిరంతరాయంగా..

- తాళ్లపూసపల్లిలో రైల్వే ట్రాక్ మరమ్మతులు పూర్తి
- గూడ్స్ రైలుతో ట్రయల్‌రన్ నిర్వహణ
- ఇంటికన్నె వద్ద యుద్ధప్రాతిపదికన పనులు
- పునరుద్ధరణ పనుల్లో వెయ్యి మందికిపైగా సిబ్బంది



ఇంటికన్నె సమీపంలో రైల్వే ట్రాక్ మరమ్మతు పనుల్లో కూలీలు

కేసముద్రం, సెప్టెంబరు 3 : ఇటీవలి భారీ వర్షం, వరద బీభత్సం కారణంగా సికింద్రాబాద్-విజయవాడ సెక్షన్‌లోని మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తాళ్లపూసపల్లి-మహబూబాబాద్ రైల్వే స్టేషన్ల మధ్య, కేసముద్రం-ఇంటికన్నె రైల్వేస్టేషన్ల మధ్య వరద ప్రవాహానికి ట్రాక్ ధ్వంసమై రైళ్ల రాకపోకలు పూర్తిగా నిలిచిన విషయం తెలిసిందే. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు పడిన భారీ వర్షం కారణంగా తాళ్లపూసపల్లి-మహబూబాబాద్ రైల్వేస్టేషన్ల మధ్య 432, 434 కిలోమీటరు వద్ద సుమారు 20 మీటర్ల పొడవు, అలాగే ఇంటికన్నె వద్ద 418 కిలోమీటరు వద్ద 40 మీటర్ల పొడవు రైల్వే ట్రాక్ వరద తాకిడికి ధ్వంసమైంది. ఫలితంగా శనివారం రాత్రి నుంచి సికింద్రాబాద్-విజయవాడ సెక్షన్ల మధ్య రైళ్ల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో అప్రమత్తమైన రైల్వే శాఖ ఆదివారం సాయంత్రం నుంచే పట్టాల మరమ్మతు పనులు చేపట్టి నిరంతరాయంగా కొనసాగిస్తోంది. దీంతో తాళ్లపూసపల్లి-మహబూబాబాద్ మధ్య మంగళవారం ఉదయం వరకు ట్రాక్‌ను సిద్ధం చేసి మధ్యాహ్నం ట్రయల్ రన్‌లో భాగంగా గూడ్స్ రైలును కూడా నడిపించారు. ఇక ఇంటికన్నె వద్ద ట్రాక్ బాగా దెబ్బతినడంతో మరమ్మతు పనులకు సమయం పడుతోంది. సోమవారం ఉదయం నాటికి వరద ప్రవాహం కొంత తగ్గుముఖం పట్టడంతో ఎనిమిది ఎక్స్‌కవేటర్ యంత్రాలను తీసుకువచ్చి రైలు కట్ట పటిష్ఠం కోసం మంగళవారం సాయంత్రం వరకు మట్టికట్టను పోశారు. యంత్రాలతో కంకర నింపుతున్నారు. మరోవైపు ఇదే ప్రాంతంలో పాక్షికంగా దెబ్బతిన్న రైల్వే ట్రాక్ వద్ద సిబ్బందితో మరమ్మతులు చేయిస్తున్నారు. ఇక్కడ రైల్వే ఇంజనీరింగ్ కార్మికులు, ఓహెచ్ఈ(ఓవర్ హెడ్ ఎలక్ట్రికల్స్), కమ్యూనికేషన్స్ తదితర విభాగాలకు సంబంధించిన వెయ్యి మందికి పైగా సిబ్బంది మరమ్మతు పనుల్లో పాల్గొనడం గమనార్హం. మంగళవారం రాత్రి పట్టాలను ఏర్పాటు చేయడం, కంకర ప్యాకింగ్ పూర్తి చేసి బుధవారం మధ్యాహ్నం వరకు రైలు పట్టాల పునరుద్ధరణ జరిగే అవకాశం ఉందని రైల్వే వర్గాలు భావిస్తున్నాయి.

రైళ్ల పునరుద్ధరణకు మరో రెండురోజులు!

కాజీపేట, సెప్టెంబరు 3: భారీవర్షాల నేపథ్యంలో ఇంటికన్నె-కేసముద్రం, తాళ్లపూసలపల్లి-మహబూబాబాద్ మధ్య రైల్వే ట్రాక్ దెబ్బతినడంతో విజయవాడ వైపు వెళ్లే అన్ని రైళ్లను రద్దుచేసిన సంగతి తెలిసిందే. విజయవాడ వైపు వెళ్లే రైళ్లు మంగళవారం సైతం రద్దు చేశారు. ఆ రూట్‌లలో రైళ్ల పునరుద్ధరణకు మరో రెండురోజులు పట్టే అవకాశం ఉందని రైల్వే అధికారులు చెబుతున్నారు. తాళ్లపూసలపల్లి - మహబూబాబాద్ మధ్య దెబ్బతిన్న రైల్వే ట్రాక్‌ను రైల్వే సిబ్బంది రేయింబవళ్లు పనిచేయడంతో ఆ ట్రాక్‌ను మంగళవారం మరమ్మతును పూర్తి చేశారు. ఆ ట్రాక్‌పై ట్రయల్ రన్ సైతం పూర్తి చేశారు. ఇదే రూట్‌లో ఇంటికన్నె - కేసముద్రం మధ్య దెబ్బతిన్న రైల్‌ట్రాక్ పునరుద్ధరణ పనులు ఇంకా కొనసాగుతున్నాయి, ఈ ట్రాక్ మరమ్మతులు పూర్తిచేస్తేనే ఆ రూట్‌లో రైళ్లు నడుప నున్నామని, అందుకు మరోరెండు రోజులు పట్టే అవకాశం ఉందని రైల్వే అధికారులు తెలిపారు.

ముగ్గురిని బలితీసుకున్న బొగ్గులారీ

ఆర్టీసీ బస్సును ఢీ కొట్టిన ఘటనలో ముగ్గురి మృతి

- మృతుల్లో తొర్రూరుకు చెందిన దంపతులు, పాలకుర్తికి చెందిన మహిళ
- జనగామ జిల్లా వావిలాలలో ఘటన



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ నాయకురాలు ఝన్సీరెడ్డి

పాలకుర్తి/తొర్రూరు రూరల్, సెప్టెంబరు 3 : మృత్యువై దూసుకొచ్చిన ఓ బొగ్గులారీ ముగ్గురిని బలితీసుకుంది. మూలమలుపు వద్ద ఆ లారీ బస్సును ఢీ కొట్టడంతో బస్సులో ప్రయాణిస్తున్న దంపతులు సహా ఓ మహిళ మృతిచెందారు. మరో నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. ఈ సంఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని వావిలాల గ్రామ శివారులో మంగళవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డిపో నుంచి పాలకుర్తి- తొర్రూరు షటిల్ సర్వీసుగా ఓ ఆర్టీసీ బస్సు పాలకుర్తి నుంచి తొర్రూరుకు మొత్తం 18మంది ప్రయాణికులతో వెళుతోంది. ఈ క్రమంలో పాలకుర్తి మండలం వావిలాల గ్రామ శివారులో మూలమలుపు వద్ద తొర్రూరు నుంచి పాలకుర్తి వైపు వస్తున్న ఓ బొగ్గు లారీ ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం టీక్యాతండాకు చెందిన జాటోతు హేమాణి(55), బుజ్జి (50) దంపతులతో పాటు పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన ఎండి.నసీమా (55) మృతి చెందా రు. అలాగే జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదం జరిగిన తీరును ఆరా తీశారు. అయితే బొగ్గులారీ డ్రైవర్ మద్యం మత్తులో బస్సు నడపడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని తెలుస్తోంది. ఈ ఘటనలో మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం టీక్యాతండాకు చెందిన జాటోతు బాలాజీ, వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన కోలపల్లి భూలక్ష్మీ, ఎర్ర సత్యవతి, పాలకుర్తి మండలం నారబోయినగూడెం గ్రామానికి చెందిన తిరుపల్లి నాగమ్మకు స్వల్ప గాయాలయ్యాయి.



తొర్రూరులో చికిత్స పొందుతున్న జాటోతు బాలాజీ

కుమారుడు, కూతురు వద్దకు వెళ్లి వస్తుండగా..

హేమాణి, బుజ్జి దంపతులు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న తమ చిన్న కుమారుడు సుమన్, కుమార్తె అరుణలను చూసేందుకు నాలుగు రోజుల క్రితం మరో ఇద్దరు కుటుంబసభ్యులతోకలసి వెళ్లారు. తిరిగి హైదరాబాద్ నుంచి సోమవారం ఇంటికి బయల్దేరిన వారు సాయంత్రానికి దేవరుప్పల మండలం పెద్దతండా శివారు దోనెబండ తండాలో నివాసం ఉండే బుజ్జి సోదరి అయిన బానోతు రుక్కి ఇంటికి వెళ్లారు. రాత్రి అక్కడే బస చేసిన ఆ నలుగురు మంగళవారం తెల్లవారు జామున దోనెబండ తండా నుంచి పాలకుర్తి చేరుకుని.. అక్కడ తొర్రూరు వెళ్లే బస్సు ఎక్కారు. మార్గమధ్యలో వావిలాల వద్ద జరిగిన ప్రమాదంలో బస్సులో కుడివైపు కూర్చున్న హేమాని, బుజ్జి దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ క్రమంలో హేమానీ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రగాయాల పాలైన హేమాని భార్య బుజ్జిని తొర్రూరులోని ప్రైవేటు ఆసుత్రికి తర లించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతులకు ఇద్ద రు కుమారులు సోములు, సుమన్, అరుణ ఉన్నారు. ఇక మరో మృతురాలు ఎండి. నసీమాది పాలకుర్తి మండల కేంద్రం. నసీమా తొర్రూరు మండలం నాంచారిమడూరు గ్రామశివారులోని మహత్మాజ్యోతిబాపూలే డిగ్రీ గురుకుల కళాశాలలో ఔట్ సోర్సింగ్ వంట మనిషిగా పని చేస్తోంది. రోజులాగే విధులకు వెళ్లే క్రమంలో ఆమె ప్రమాదానికి గురైంది. నసీమాకు భర్త బడేసాబ్ కుమారులు యాకూబ్, మహబూబ్‌పాషా ఉన్నారు.

ఘటనా స్థలిని సందర్శించిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

ప్రమాద విషయం పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి ఘటన స్థలానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. ముగ్గురు మృతి చెందడంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఆమె బాధిత కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అయితే ఎమ్మెల్యే ఆస్పత్రిని సందర్శించిన సమయంలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో కలెక్టర్‌కు ఫోన్ చేసి గైర్హాజరైన వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇక మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మృతురాలు నసీమా భర్త బడేసాబ్‌తో మాట్లాడి ఓదార్చారు. బీఆర్ఎస్ తరుపున ఆదుకుంటామని భరోసానిచ్చారు.

లారీ డ్రైవర్ మద్యం తాగడమే కారణమా?

ఆర్టీసీ బస్సును ఢీ కొట్టి ముగ్గురు మృతికి కారణమైన బొగ్గు లారీ డ్రైవర్ మద్యం సేవించి వాహనాన్ని నడపడం వల్ల ఈ ఘోర ప్రమాదం జరిగిందని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఘటనకు అరగంట ముందు సదరు డ్రైవర్ వావిలాల గ్రామంలో లారీ నిలిపి బెల్ట్ దుకాణంలో మద్యం తాగినట్టు తెలిసింది. ఆ డ్రైవర్ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించగా.. ఘటన జరిగిన కొద్దిసేపటికే డ్రైవర్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్టు సమాచారం.

దంపతుల మృతితో టీక్యాతండాలో విషాదం

పాలకుర్తి మండలం వావిలాల గ్రామశివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తొర్రూరు మండలం మండలం వెల్లికట్టె గ్రామ శివారు టీక్యాతండాకు చెందిన జాటోతు హేమానీ(60) బుజ్జమ్మ(55) దంపతులు మృతిచెందడంతో తీవ్ర విషాదం నెలకొంది. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించే వీరు హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడు సుమన్, కుమార్తె అరుణను చూసివచ్చేందుకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో ప్రమాదానికి గురై మృతిచెందడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

ఎన్పీడీసీఎల్‌కు తీరని నష్టం

- దెబ్బతిన్న స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్స్, ఇన్సులేటర్లు
- సుమారు 5 కోట్లకుపైగా నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 2: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎన్పీడీసీఎల్‌కు తీరని నష్టం వాటిల్లింది. వరదనీటి ధాటికి పలు స్తంభాలు పూర్తిగా దెబ్బతినడం, నేలమట్టం కావడం, పవర్ ట్రాన్స్‌ఫార్మర్స్, ఇన్సులేటర్లు దెబ్బతినడంతో విద్యుత్ సరఫరాలకు ఆటంకం కలిగింది. విద్యుత్ సిబ్బంది యుద్ధప్రాతిపదిక మరమ్మతుల చేపట్టి కమర్షియల్, డొమెస్టిక్ సర్వీసులకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. మహబూబాబాద్ జిల్లాలోని చిన్నగూడూరు, నర్సింహులపేట, మరిపెడ, ఎల్లంపేట మండలాల్లో వర్షపాతం ఎక్కువగా ఉండటంతో ఆ ప్రాంతాల్లో విద్యుత్ శాఖకు ఎక్కువగా నష్టం జరిగింది. ఆకేరువాగు తాకిడికి ఉల్లంపల్లిలో 33 బై 11 కేవీ సబ్‌స్టేషన్ నీట మునగడంతో కంట్రోల్‌రూమ్, ప్యానల్స్, ఇతరత్ర సామగ్రి దెబ్బతిన్నాయి. జిల్లాలో ప్రవహిస్తున్న పాలేరు, ఆకేరు, మున్నేరు, పాఖాలవాగు తీరం వెంబడి ఉన్న వ్యవసాయ కనెక్షన్లకు సంబంధించి సుమారు 900 విద్యుత్ స్తంభాలు దెబ్బతినడంతో పాటు కొన్ని నెలకొరగగా, 150 పైగా ట్రాన్స్‌ఫార్మర్స్ నీట మునగడం, ప్లింత్ నుంచి నీటిలో పడిపోయాయి. తాత్కాలికంగా విద్యుత్ సరఫరా చేసేందుకు వీటిన్నింటి మరమ్మతులకు కలిపి సుమారు రూ.40 లక్షల వరకు అంచనా వేస్తుండగా పూర్తి స్థాయిలో మరమ్మతుల చేసేందుకు సమారు రూ.2కోట్ల వరకు ఖర్చు అవుతుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. నివాసాలకు సరఫరా చేసే విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మలు విరిగిపడి చాలా చోట్ల తీగలు తెగిపోగా వెంటనే సిబ్బంది రంగంలోకి దిగి పునరుద్ధరించినట్లు తెలిపారు. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సిబ్బందిని అప్రమత్తం చేస్తూ అంతరాయాలు లేకుండా చేసే ప్రయత్నం చేశారు. కొన్ని చోట్ల సబ్‌స్టేషన్‌ల్లోకి నీరు చేరడంతో ప్రత్యామ్నాయ పద్ధతిలో పక్క సబ్‌స్టేషన్‌ల నుంచి విద్యుత్‌ను సరఫరా చేశారు.

స్వీయ నియంత్రణ ముఖ్యం

వినియోగదారులు ఎట్టిపరిస్థితుల్లో స్వయంగా విద్యుత్ మరమ్మతులు చేయరాదని వివిధ జిల్లాల సర్కిల్ అధికారులు సూచిస్తున్నారు. విద్యుత్ స్తంభాలు, ఇంట్లోని స్విచ్ బోర్డులను తడిచేతులతో తాకరాదన్నారు. విద్యుత్ అంతరాయంతో పాటు విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్య ఉన్నా.. విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబర్ 1912, 18004250028 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. అర్ధరాత్రి వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఉన్నతాధికారుల అదేశాలతో విద్యుత్‌ను పునరుద్ధరించిన సిబ్బందిని ఆయా జిల్లాల ఎస్ఈలు ప్రత్యేకంగా అభినందిచారు.



ములుగు జిల్లాలో క్రేన్ సహాయంతో కొత్త పోల్‌ను ఏర్పాటు చేస్తున్న విద్యుత్ అధికారులు

నష్టం

భూపాలపల్లి జిల్లాలో 263 స్తంభాలు, 2 పవర్ ట్రాన్స్‌ఫార్మర్స్, 9 డీటీఆర్‌లు దెబ్బతినగా సుమారు 1.60 లక్షల నష్టం వాటిల్లినట్లుగా విద్యుత్ అధికారులు అంచనా వేశారు. వరంగల్ జిల్లాలో ఇప్పటి వరకు 193 విద్యుత్ పోల్స్, 95 ట్రాన్స్‌ఫార్మర్స్ దెబ్బతినగా 1.20 లక్షల నష్టం వాటిల్లిందని, ఇంకా ఈ నష్టం పెరిగే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. జనగామలో 22 విద్యుత్ స్తంభాలు, 2 ట్రాన్స్‌ఫార్మర్స్ దెబ్బతినగా 2 లక్షల నష్టం వాటిల్లిందని అంచనాకు వచ్చారు. హనుమకొండ జిల్లాలో 18 పోల్స్, 23 ఇన్సులేటర్లు, 1 ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతినగా రూ.1.8 లక్షల నష్టం జరిగిందని అధికారులు తెలిపారు.

దెబ్బతిన్న చోట వెంటనే పునరుద్ధరణ పనుల చేపట్టాలి

టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటీ వరుణ్‌రెడ్డి

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 3: మరో రెండు రోజులు భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో విద్యుత్‌శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని టీజీ ఎన్పీడీసీఎల్ కర్నాటీ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలతో మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. మహబూబాబాద్, భూపాలపల్లి, ఖమ్మం జిల్లాల్లో వరదల కారణంగా చెట్లు విరిగిపడి చాలా చోట్ల విద్యుత్ తీగలు తెగడం, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నీటమునగడం, ఇన్సులేటర్లు దెబ్బతినడం జరిగాయన్నారు. వాటి పనులను వేగంగా పునరుద్ధరణ చేయాలని ఆదేశించారు. కావాల్సిన మెటీరియల్, సిబ్బందిని అందిస్తామన్నారు. మునిగిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్ల వద్ద నీటి ప్రవాహం తగ్గిన తర్వాత పునరుద్ధరణ పనులు చేపట్టాలన్నారు. వర్షాల కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నా యంగా మరొక సబ్‌స్టేషన్ నుంచి సరఫరా ఉండేలా ముందస్తుచర్యలు చేపట్టాలన్నారు. తద్వారా అంతరాయలు తగ్గుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు బి.అశోక్‌కుమార్, టి.సదర్‌లాల్, టి.మధుసూ దన్, సీజీఎం రాజు చౌహాన్, జీఎంలు నాగప్రసాద్, మల్లికార్జున్, అన్నపూర్ణ, శ్రీనివాస్, అంకుశ్, డీఈలు అనిల్‌కుమార్, శ్రీధరాచారి, రమణారెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో ఉరి వేసుకొని ఆత్మహత్య



మహేందర్ (ఫైల్)

ధర్మసాగర్, సెప్టెంబర్ 3: ఉరి వేసుకొని మొగిలిచర్ల మహేందర్ (38) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై పోచయ్య మంగళవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామానికి చెందిన మహేందర్ 18 ఏళ్ల కిందట రఘునాథపల్లి మండలం తాటికాయల గ్రామానికి చెందిన రమతో వివాహమైంది. గ్రామంలోనే లాండ్రీషాపు నడుపుకుంటూ ఇద్దరు జీవిస్తున్నారు. వీరికి సంతానం కాకపోవడంతో రమ మానసికంగా అనారోగ్యానికి గురైంది. దీంతో నాలుగు నెలల కిందట రమ తల్లిదండ్రులు ఆమెను పుట్టింటికి తీసుకెళ్లారు. దీంతో భార్య రావడం లేదని మనస్థాపం చెందిన మహేందర్ సోమవారం రాత్రి హనుమకొండలో ఉంటున్న తన అక్క స్వరూపకు ఫోన్ చేసి తాను చనిపోతున్నానని చెప్పాడు. మంగళవారం తెల్లవారుజామున స్వరూప మహేందర్‌కు ఫోన్ చేయగా ఎంతకూ ఫోన్ ఎత్తకపోవడంతో అనుమానం వచ్చి చుట్టుపక్కల వారికి ఫోన్ చేసి తమ్ముడు మహేందర్ ఫోన్ ఎత్తడం లేదని చెప్పడంతో వారు మహేందర్ ఇంటికి వెళ్లి కిటికీలోంచి చూశారు. మహేందర్ ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయన్ని మృతుడి కుటుంబ సభ్యులకు, గ్రామస్థులకు తెలపడంతో వారు విచ్చేసి స్థానికుల సాయంతో పోలీసులకు సమాచారాన్ని అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి విచ్చేసి మృత దేహాన్ని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాగులో పడి రైతు గల్లంతు

నెక్కొండ మండలం గుండ్రపల్లి శివారులో ఘటన



గల్లంతైన రైతు అజ్‌మత్

నెక్కొండ, సెప్టెంబరు 3: వాగు దాటుతుండగా రైతు గల్లంతైన ఘటన వరంగల్ జిల్లా నెక్కొండ మండలం గుండ్రపల్లి గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు, రెవెన్యూ అధికారుల కథనం ప్రకారం. గ్రామానికి చెందిన షేక్ అజ్‌మత్ (35) వ్యవసాయ పనుల కోసం వెళ్లాడు. పనులు ముగించుకుని ఇంటి బయలుదేరాడు. గ్రామ శివారులోని పట్టివాగు దాటుతుండగా నీటి ప్రవాహం పెరగడంతో వాగులో కొట్టుకుపోయాడు. సమీపంలోని రైతులు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. విషయం తెలుసుకున్న నెక్కొండ తహసీల్దార్ రాజ్‌కుమార్, చెన్నారావుపేట ఎస్సై అరుణ్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని రైతు ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అజ్‌మత్‌కు భార్య చాందిని, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ముంపు గ్రామాల్లో అధికారుల పర్యటన

మేడారం, సెప్టెంబరు 3: తాడ్వాయి మండలంలోని ఎల్బాక, పడిగాపూర్ గ్రామాల్లో వైద్య ఆరోగ్య, రెవెన్యూ, పోలీసు, విద్యుత్, పంచాయతీ అధికారులు మంగళవారం పర్యటించారు. వరద ముంపు సమస్యతో సతమతమవుతున్న తమకు సౌకర్యాలు కల్పించడం లేదని ఈ రెండు గ్రామాల ప్రజలు సోమవారం నిరసనకు దిగిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర ఆదేశాల మేరకు పలు శాఖల అధికారులతో కలిసి గ్రామంలో పర్యటించి గ్రామస్థులతో మాట్లాడామని తాడ్వాయి మండల ప్రత్యేక అధికారి, డీఎంహెచ్‌వో అప్పయ్య తెలిపారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, వరదల సమయంలో ప్రజలకు అందుబాటులో ఉంటున్నామని తెలిపారు. సమస్యలు ఉంటే హెల్ప్ లైన్‌కు ఫోన్ చేయొచ్చని సూచించారు. జంపన్నవాగుపై పెద్ద వంతెన మంజూరైందని, దీంతో రవాణా సమస్యకు పరిష్కారం లభించనుందని తెలిపారు. విద్యుత్, పారిశుధ్యం, వైద్య ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రెండు గ్రామాల్లో 237 మందిని పరీక్షించగా 32మందికి జలుబు, దగ్గు, జ్వరం ఉన్నట్టు నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీవో శ్రీధర్‌రావు, కార్యదర్శి ధర్మేందర్, గ్రామస్థులు కాక లింగాయ్య, కాయం ఎల్లయ్య, కృష్ణ, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అందజేసిన ఎస్సై

గోవిందరావుపేట, సెప్టెంబరు 3: ఓ వ్యక్తి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను అధునాతన టెక్నాలజీ సహాయంతో కనిపెట్టి బాధితుడికి అందించారు పస్రా ఎస్సై కమలాకర్. మండలంలోని పస్రా గ్రామానికి చెందిన కొండి మహేందర్ రెండునెలల క్రితం సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో వివరాలు సేకరించి సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో పొందుపరిచి లోకేషన్ ఆధారంగా కనిపెట్టి బాధితుడికి అందజేసినట్లు చెప్పారు. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకున్నట్లయితే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై సూచించారు.

గణపతి ఉత్సవ కమిటీ ఎన్నిక

మొగుళ్లపల్లి, సెప్టెంబరు 3: మండలకేంద్రంలోని సాంబమూర్తి దేవాలయం ఆవరణలో మంగళవారం గణపతి నవరాత్రుల ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా క్యాతరాజు రమేష్, ఉపాధ్యక్షుడిగా దేవునూరి కుమార్, ప్రధాన కార్యదర్శిగా వడ్లకొండ అశోక్, కోశాధికారిగా ఎరబాటి మహేందర్, సహాయ కార్యదర్శిగా బత్తిని రాజు, సభ్యులుగా వేణవంక నవీన్, క్యాతరాజు రజనీకాంత్, గుడిమల్ల రమేష్, వేణవంక ప్రసాద్, తంగళ్లపల్లి వీరబ్రహ్మం, పోలంపల్లి శంకర్, కట్కూరి శ్రీధర్, నీరటి సంతోష్, దేవునూరి అశోక్, అన్నారపు కుమారస్వామి, వనం రాజశేఖర్ ఎన్నికయ్యారు.

'ఉన్నతి' సర్టిఫికెట్ల ప్రదానం

రేగొండ, సెప్టెంబరు 3: మండలంలో 'ఉన్నతి' శిక్షణ పూర్తిచేసుకున్న 35 మందికి ఏడీఆర్డీవో వసుమతి మంగళవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. శిక్షణ పొందిన వారు వృత్తి నైపుణ్యంతో ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రాంప్రసాద్, ఏపీవో జమీర్‌పాషా, డీఆర్పీ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి చేయూత

రేగొండ, సెప్టెంబరు 3: మండలంలోని దామరంచపల్లి గ్రామానికి చెందిన విద్యార్థిని జూపాక ప్రతిభకు పీఏసీఎస్ చైర్మన్ విజ్ఞన్‌రావు ఆర్థికసాయం అందించారు. ఎంబీఏ పూర్తి చేసిన ప్రతిభ విదేశాల్లో ఉన్నత చదువుల కోసం ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందించింది. మిగతా డబ్బుల ఆమెకు అవసరం ఉండగా విజ్ఞన్‌రావు రూ. 5 వేలు అందజేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ నీలా, డైరెక్టర్ మధుసూదన్, భగవాన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గోదావరి దోబూచులాట

మహదేవపూర్, సెప్టెంబరు 3 : మండలంలోని కాళేశ్వర త్రివేణి సంగమం వద్ద గోదావరి తగ్గుతూ పెరుగుతూ దోబోచులాడుతోంది. భారీ వర్షాలకు కాళేశ్వరం వద్ద ప్రాణ హిత వరద పెద్ద ఎత్తున చేరింది. ఈ క్రమంలో సోమ వారం పుష్కరఘాట్ మెట్ల వద్దకు చేరుకోగా మంగళవారం ఉదయం నుంచి కొంత తగ్గుముఖం పట్టింది. సాయంత్రం మళ్లీ పెరిగింది. 1.920 మీటర్ల ఎత్తులో గోదావరి ప్రవహిస్తోందని అధికారులు వెల్లడించారు.

పరిశీలించిన ఏఎస్పీ, డీఎస్పీ

కాళేశ్వరం గోదావరి మెయిన్ గేటు వద్ద ప్రవాహ ఉధృతిని భూపాలపల్లి అడిషనల్ ఎస్పీ బోనాల కిషన్, కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి పరిశీలించారు. గోదావరి ప్రవా హం పెరుగుతున్న దృష్ట్యా తీర వాసులు, చిరువ్యా పారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వీరి వెంట మహ దేవపూర్ సీఐ రామచంద్రరావు, కాళేశ్వరం ఎస్సై చక్రపాణి, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ ఉన్నారు.

- వాజేడు: మండలంలో గోదావరి ప్రవాహం మంగళవారం మధ్యాహ్నం వరకు పెరిగింది. అనంతరం క్రమేణా తగ్గుతూ వచ్చింది. పేరూరు వద్ద ఉదయం 5 గంటలకు 14.70 మీటర్లతో ఉన్న నీటిమట్టం 7గంటలకు 15.25 మీటర్లు, 9గంటలకు 15.54 మీటర్లు, 10 గంటలకు 15.54 మీటర్లు ఉంది. అనంతరం 11గంటలకు 15.20 మీటర్లకు చేరుకొని తగ్గుతూ వచ్చింది. 12కు 15.49 మీటర్లు, 3కు 15.34, 5గంటలకు 15.30 మీటర్లకు చేరిందని సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు.
- మంగపేట: మండలంలోని కమలాపురం బిల్ట్ ఇన్‌టేక్‌వెల్ వద్ద సోమవారం ఉదయం నుంచే గోదావరి పెరిగింది. సముద్ర మట్టానికి 7.30 మీటర్ల వరకు వరకు ప్రవహించింది. మంగళవారం సాయంత్రం వరకు 8.50 మీటర్లకు చేరింది. గోదావరి వరద పెరుగుతుండటంతో ఎంపీడీవో భద్రూనాయక్ తీర గ్రామాల్లో పర్యటించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, గ్రామ ప్రత్యేక అధికారులు అందు బాటులో ఉండాలన్నారు.
- కన్నాయిగూడెం: మండలంలోని తుపాకుల గూడెంలో సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద గోదావరి తగ్గుముఖం పట్టింది. మంగళవారం ఉదయం వరకు పెరుగుతూ వచ్చింది. మధ్యాహ్నం నుంచి స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. ఎగువ నుంచి 7,23,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో బ్యారేజీలోని మొత్తం గేట్లు ఎత్తి, వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు వదులుతున్నారు. బ్యారేజీ పూర్తిస్థాయి నీటిమట్టం 83 మీటర్లు కాగా 81.90 మీటర్లు నమోదైంది.

మట్టి విగ్రహాలనే పూజించాలి

ములుగు కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 3: వినాయక చవితిని పురస్కరించుకుని జిల్లాలోని ప్రజలు, మండపాల నిర్వాహకులు మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆయన అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సంపత్‌రావుతో కలిసి మట్టి గణేష్ విగ్రహాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. పర్యావరణానికి అనుకూలమైన మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. రాష్ట్ర కాలుష్య మండలి ప్రతి జిల్లాకు రెండు వేల మట్టి విగ్రహాలను ఉచి తంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పర్యావరణంపై అవగా హన కార్యక్రమాలు చేపడుతోం దన్నారు. ఈ కార్య క్రమంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారి సుభాష్ నాయక్, కలెక్టరేట్ ఏవో రాజ్‌కుమార్, ఎస్సీ కార్పొ రేషన్ ఈడీ రవి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

విస్తృతంగా వైద్య శిబిరాలు

వెంకటాపురం(నూగూరు), సెప్టెంబరు 3: మండలంలోని వీరభద్రవరం, నూగూరు, అలుబాక, వీఆర్కేపురం, మరికాల గ్రామాల్లో మంగళవారం వైద్యశిబిరాలు జరిగాయి. ఈసందర్భంగా డాక్టర్ భవ్యశ్రీ గ్రామస్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పలువురి నుంచి రక్తనమూనాలు సేకరించారు. అదేవిధంగా ఆరోగ్యమహిళా కేంద్రంలో మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ప్రజలు సీజనల్‌వ్యాధులు దరి చేరకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. శిబిరాల్లో వైద్యాధికారి కిరణ్, సిబ్బంది జ్యోతి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

- కాటారం: మండల వ్యాప్తంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో డ్రై డే కార్యక్రమాలు జరిగాయి. పలు గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించి ఫీవర్ సర్వే చేపట్టారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మౌనిక కొత్తపల్లి, పోతులవాయి గ్రామాల్లో గర్భిణుల ఇళ్లకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ప్రసవానికి రోజులు దగ్గరపడ్డ వారిని ఆస్పత్రికి రావాలన్నారు. వైద్యశిబిరాల్లో ఆరోగ్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డెంగీ, చికున్‌గున్యా, కలరా, టైఫాయిడ్ తదితర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో వైద్యులు సుమన్, తిరుపతి, హెచ్‌ఈవో తిరుపతిరెడ్డి, హెచ్‌ఎస్ సరళ, హెచ్‌ఏ సమ్మయ్య, ఏఎన్‌ఎంలు మనోరమ, నాగరాణి, రజని, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.
- కన్నాయిగూడెం: మండలంలోని చింతగూడెంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అభినవ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇంటింటి ఫీవర్ సర్వే చేపట్టారు. జ్వరంతో బాధపడుతున్న వారి రక్తనమూనాలు సేకరించి పరీక్షించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమణకుమారి, ఏఎన్‌ఎంలు మంజువాణి, లత, ఊర్మిళ, ఆశా కార్తకలు దుర్గం లక్ష్మి, రాధ, కుమారి, జ్యోతిరాణి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.
- మంగపేట: ములుగు- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల సరిహద్దు అకినేపల్లి మల్లారం, ఎస్టీ కాలనీల్లో బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహించారు. 140 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. హెచ్‌ఈవో జయశ్రీ, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.
- వెంకటాపూర్(రామప్ప): మండలంలోని జవహర్‌నగర్, రామాంజాపూర్, అడవిరంగాపూర్ గ్రామాల్లో వైద్యాధికారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. 152 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు చందన, సంఘమిత్ర, భవ్య, హెచ్‌వీ పుష్పకుమారి, ఏఎన్‌ఎంలు స్వర్ణలత, ఫాతిమా, కనకలక్ష్మి, సుశీల, శోభారాణి, ఆశాలు పాల్గొన్నారు.



కన్నాయిగూడెం మండలం చింతగూడెంలో వైద్య శిబిరం

పూర్తయిన వంతెన పనులు

నేడు పునఃప్రారంభోత్సవం

టేకుమట్ల, సెప్టెంబరు 3: టేకుమట్ల-రాఘవరెడ్డిపేట గ్రామాల మధ్య చలివాగుపై గత ఏడాది జూలై 27న భారీ వర్షాలకు దెబ్బతిన్న వంతెన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రూ. 5 కోట్లతో నిర్మించిన ఈ వంతెనను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు బుధవారం పునఃప్రారంభించనున్నారు. వంతెన కూలిపోవడంతో వాగు అవతలి తొమ్మిది గ్రామాల ప్రజలు, ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడా సమస్య తీరనుంది.

కూల్చేశారు.. వదిలేశారు

పునర్నిర్మాణంలో భాగంగా గతంలో దెబ్బతిన్న వంతెన రెండు పిల్లర్లను, దానిపై ఉండే శ్లాబ్‌ను పూర్తిగా కూల్చేసి వాగులోనే పడేశారు. వంతెనా పూర్తయినా వాటిని తొలగించలేదు. భారీ వర్షాలు కురిసి చలివాగు ఉగ్రరూపం దాల్చితే ఆ శిథిలాలు నీటి ప్రవాహానికి అడ్డొచ్చి ప్రెజర్ మరింత పెరిగి వంతెనకు గట్టిగా తాకే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. దీంతో వంతెన మళ్లీ దెబ్బతినే ప్రమాదం ఉందని అంటున్నారు. కూల్చేసిన శిథిలాలను వెంటనే వాగులోంచి బయటకు తీసి ప్రమాదం జరగకుండా చూడాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.



ఇంకా వాగులోనే ఉన్న శిథిలాలు

అంతరాయం ఏర్పడకుండా విద్యుత్ సరఫరా

- టీజీఎన్‌పీ డీసీఎల్ సీఈ భీకంసింగ్

కాటారం, సెప్టెంబరు 3: సాంకేతిక కారణాలు, ప్రకృతి వైపరీత్యాలతో ఎక్కడైనా ఇబ్బందులు ఏర్పడ్డా విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా వెంటనే చర్యలు తీసుకుంటున్నామని టీజీఎన్‌పీ డీసీఎల్ సీఈ, ఇన్‌చార్జి సీజీఎం భీకంసింగ్ అన్నారు. భారీ వర్షాలతో జిల్లా పరిధిలో దెబ్బతిన్న 130 స్తంభాలను, ఐదుట్రాన్స్‌ఫార్మర్లను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించామన్నారు. ధన్వాడ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో తెల్లవారుజామున సాంకేతిక లోపంతో దెబ్బతిన్న ఓఎల్‌టీసీని ఎస్ఈ మల్సూర్‌నాయక్, డీఈ నాగరాజుతో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. నిపుణుల బృందాన్ని రప్పించి మరమ్మతులు చేస్తున్న తీరును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడారు. పిడుగులతో చిట్యాల మండలం రామకిష్టాపురంలో పీటీఆర్ దెబ్బతినగా వెంటనే మార్చేశామన్నారు. ధన్వాడలో పీటీఆర్ సాంకేతిక లోపంతో దెబ్బతినడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా కాటారం, గంగారం సబ్ స్టేషన్ల నుంచి నాలుగు ఫీడర్ల ద్వారా కరెంట్ సరఫరాను వెంటనే పునరుద్ధరిం చామన్నారు. ధన్వాడలో మరో 5 ఎంవీఏ పీటీఆర్ కోసం ప్రతి పాదనలు పంపామన్నారు. పీటీఆర్‌లో శబ్దం రాగానే ఆపరేటర్ కడారి ధనుష్ వెంటనే పవర్ ఆఫ్ చేయడంతో లక్షలాది రూపాయల విలువైన పీటీఆర్ కాలి పోకుండా కొద్దిపాటి మరమ్మతులకు ఆస్కారం కలిగిందన్నారు. ఆయన వెంట ఏడీఈ డి.నాగరాజు, ఏఈ మేఘనాథ్, లైన్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కాంత్, ఎల్ఎం ప్రవీణ్ ఉన్నారు.

పాఠశాలకు వాషింగ్టన్ తెలంగాణ అసోసియేషన్ వితరణ

ఏటూరునాగారం, సెప్టెంబరు 3 : మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు మంగళవారం వాషింగ్టన్ తెలంగాణ అసోసియేషన్ రూ. లక్ష 40 వేల విలువ కలిగిన 20 డ్యూయల్ డెస్క్ బెంచీలను వితరణ చేసింది. ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ చేతుల మీదుగా మంగళవారం ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్‌కు అందజేశారు. వాషింగ్టన్ తెలంగాణ అసోసియేషన్ బాధ్యులు పన్యాల నాగార్జునరెడ్డి, రాజేష్, గిరీష్‌రావు, అలినేని నితీష్‌కుమార్‌ను, ప్రతినిధిగా వచ్చిన బద్దం సుదర్శన్‌రెడ్డిని ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం సత్కరించింది. ఏటూరునాగారం స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సాంబశివరావు, ఉపాధ్యాయులు రమాదేవి, రాంబాబు, సారంగపాణి, గ్రామ పెద్దలు, సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్, చిన్న కేశవులు, విశ్వనాథ్, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

'సీతక్కను విమర్శిస్తే సహించం'

వెంకటాపూర్(రామప్ప), సెప్టెంబరు 3: అనునిత్యం ప్రజల కోసం పాటుపడుతున్న మంత్రి ధనసరి సీతక్కపై అనుచిత వ్యాఖ్యలతో విమర్శిస్తే సహించేది లేదని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్టికోళ్ల వెంకటేశ్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలో ప్రకృతి విలయతాండవం చేస్తుంటే బాధితులను పరామర్శించని నేతలు.. సీతక్కపై లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదని పేర్కొన్నారు.

సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలి

- మావోయిస్టు కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి

కాకతీయఖని, సెప్టెంబరు 3: సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు హైపవర్ కమిటీ సూచనల మేరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని మావోయిస్టు పార్టీ సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సింగరేణిలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు సుమారు 29 వేల మంది పనిచేస్తున్నారని తెలిపారు. గనులు, డిపార్ట్‌మెంట్లల్లో పనిచేస్తూ శ్రమదోపిడీకి గురవుతున్నారని, వారికి నెలల తరబడి వేతనాలు చెల్లించడం లేదని విమ ర్శించారు. వారి పేర్లపై పీఎఫ్ నిధులు జమ చేయ కుండా కార్మికుల వేతనాల నుంచి రికవరీ చేస్తు న్నారని ఆరోపించారు. శ్రీరాంపూర్ ఏరియాలో రూ.5 కోట్ల పీఎఫ్ నిధులను ఓ కాంట్రాక్టర్, ఏరియాలోని కంపెనీ అధికారులు కొందరు స్వాహా చేశారని తెలి పారు. కాంట్రాక్ట్ కార్మికులకు చట్టపరంగా చెల్లిం చాల్సిన వేతనాలు, అలవెన్సులు చెల్లించకపోగా కాం ట్రాక్టర్లు గూండాల చేత భౌతికదాడులు చేయిస్తు న్నారని విమర్శించారు.

అంతర్రాష్ట్ర రాకపోకలు బంద్

(5వ పేజీ తరువాయి)

పెరగింది. దీంతో వరద నీరు జాతీయ రహదారిని ముంచెత్తడంతో ఇరు రాష్ట్రాల మధ్య రాకపోకలు స్తంభించాయి. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. వరద ఉధృతిని సీఐ కుమార్, ఎస్సై కృష్ణప్రసాద్ పరిశీలించారు. ప్రజలు వాగులు దాటకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసు సిబ్బందిని పహారా ఉంచారు. వరదలు ఉన్న దృష్ట్యా ఎవరూ బయటకు రావద్దని గ్రామాల్లో ప్రచారం చేయించి ప్రజలను అప్రమత్తం చేశారు.

ఇదిలా ఉండగా మండలంలోని పలు అంతర్గత రహదారులను వరద ముంచెత్తింది. పేరూరు - చంద్రుపట్ల మధ్య మరిమాగు వాగు ఉధృతి పెరిగి రాకపోకలు నిలిచిపోయాయి. కోయవీరాపురం గ్రామానికి సైతం వరదల వల్ల రాకపోకలు స్తంభించాయి. ఏడ్జర్ల పల్లి-బొమ్మనపల్లి, వాజేడు-గుమ్మడిదొడ్డి గ్రామాల మధ్య అంతర్గత రహదారులు కూడా వరదతో మునిగిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

తహసీల్దార్‌కు భూటారం వాసుల వినతి

ఏటూరునాగారం, సెప్టెంబరు 3 : తమకు స్థలాలు కేటాయించి ఇంటి నిర్మాణాలు చేపట్టాలని ఏటూరునాగారం గ్రామ పంచాయతీ పరిధిలోని ఆవాస గ్రామమైన భూటారం గ్రామం ప్రజలు అధికారులను కోరారు. ఈ మేరకు తహసీల్దార్ జగదీశ్వర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. వరదల నేపథ్యంలో రెండు రోజుల క్రితం గ్రామంలోని 70 కుటుంబాల్లోని 230 మందిని అధికారులు పునరావాస కేంద్రానికి తరలించారు. వరదలు సంభవించినప్పుడు తమను పునరావాస కేంద్రాలకు తరలించడం, ఆ తర్వాత తిరిగి ఊరిగికి పంపడం పరిపాటిగా మారిందని, ఇప్పటికైనా సురక్షిత ప్రాంతంలో ఇళ్లు నిర్మించి ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు.

స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి

తాడ్వాయి, సెప్టెంబరు 3: ఆపద సమయంలో సహాయం చేయడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. మండలంలోని కొండపర్తి గ్రామంలో వర్షాలతో నష్టపోయిన 16 కుటుంబాలకు ఆర్‌డీటీ సంస్థ సమకూర్చిన టార్పాలిన్ కవర్లతోపాటు 14రకాల నిత్యావసర సరుకులను కలెక్టర్ పంపిణీ చేశారు. కొండపర్తి గ్రామంలో రెండురోజులపాటు కురిసిన భారీ వర్షాలకు 16 కుటుంబాలకు చెందిన ఇళ్లు దెబ్బతిన్నాయని, వారికి ఆర్‌డీటీ సంస్థ నిత్యావసర సరుకులు అందించడం అభినందనీయమని అన్నారు. త్వరలోనే ప్రభుత్వం తరఫున బాధిత కుటుంబాలకు నష్టపరిహారం అందజేయడం జరుగుతుందని తెలిపారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ నాగజ్యోతి

ఏటూరునాగారం, సెప్టెంబరు 3 : ఎనికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ములుగు జడ్పీ మాజీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి అన్నారు. ఏటూరునాగారం మండలం రొయ్యూరు, శంకరాజుపల్లి గ్రామాల్లో ఆమె మంగళవారం పర్య టించారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిం చిందని విమర్శించారు. హామీల అమలు కోసం ప్రజల తరపున కొట్లాడు తామన్నారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరు గ్రామస్థులను పరామర్శించారు. ఆమె వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గడదాసు సునీల్‌కుమార్, పార్టీ సీనియర్ నాయకుడు తుమ్మ మల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కూనూరు అశోక్‌గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ మాదరి రామయ్య, ఏటూరునాగారం మాజీ సర్పంచ్ ఈసం రామ్మూర్తి తదితరులు ఉన్నారు.



అనారోగ్య బాధితుడిని పరామర్శిస్తున్న నాగజ్యోతి

కాళేశ్వరం దేవస్థాన మాజీ చైర్మన్ కన్నుమూత

మహదేవపూర్, సెప్టెంబరు 3 : కాళేశ్వరం దేవస్థాన మాజీ చైర్మన్ గుడాల కృష్ణమూర్తి (65) కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. మహదేవపూర్‌కు చెందిన కృష్ణమూర్తి 2011 నుంచి 2013 వరకు కాళేశ్వరం దేవస్థానానికి చైర్మన్‌గా కొనసాగారు. ఆయన మృతిపై పలువురు సంతాపం తెలిపారు. దేవస్థానం చైర్మన్‌గా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి కృష్ణమూర్తి అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు.



కృష్ణమూర్తి (ఫైల్)

కస్తూర్బా విద్యాలయాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

మహాముత్తారం, సెప్టెంబరు 3: మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయాన్ని అదనపు కలెక్టర్ విజయలక్ష్మి మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థినులకు అందుతున్న భోజనం, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యాలయ రికార్డులు, వంట గదిని పరిశీలించారు. చాలా రోజులుగా సోలార్ వాటర్ హీటర్లు, సీసీ కెమెరాలు, వాటర్ ప్యూరీఫైడ్ పరికరం పని చేయడం లేదని ఈ సందర్భంగా విద్యార్థినులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. దోమల బెడద ఎక్కువగా ఉందని, అవి లోపలికి రాకుండా కిటి కీలు, తలుపులకు మెష్ ఏర్పాటు చేయాలని కోరారు. అదనపు కలెక్టర్ వెంట ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు, పీఆర్ ఏఈ రమేష్‌బాబు ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో

మొగుళ్లపల్లి, సెప్టెంబరు 3: మొగుళ్లపల్లి పూర్తిస్థాయి ఎంపీడీవోగా ఎమ్డీ.మహబూబ్ హుస్సేన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. హుస్సేన్ చిట్యాల ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తూ మొగుళ్లపల్లి ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేస్తున్నారు. రాష్ట్ర ఉన్నతాధికారులు హుస్సేన్‌కు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించారు.

కాటారం ఏవోగా పూర్ణిమ

కాటారం, సెప్టెంబరు 3: వ్యవసాయ శాఖ మండల అధికారి (ఏవో)గా సొల్ల పూర్ణిమ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా పెద్దపల్లి జిల్లా నుంచి కాటారం బదిలీపై వచ్చారు. కాటారం ఏవోగా ఉన్న గిరి రామకృష్ణ పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలానికి బదిలీ అయ్యారు. ఏవోగా బాధ్యతలు స్వీకరించిన పూర్ణిమ ఏడీఏ శ్రీపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఏఈవోలు రాజన్న, సరిత, దివ్యజ్యోతి, శరత్‌కు స్వాగతం పలికారు.

ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కారించాలి

పోలీసు సిబ్బందితో డీఎస్పీ సంపత్‌రావు

టేకుమట్ల, సెప్టెంబరు 3: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి సమస్యలను సత్వరమే పరిష్కారించాలని టేకుమట్ల పోలీసులను భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా టేకుమట్ల పోలీస్‌స్టేషన్‌ను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను, సిబ్బంది కిట్స్‌ను, ఠాణా పరిసరాలను పరిశీలించారు. సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. డీఎస్పీ వెంట చిట్యాల సీఐ మల్లేష్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులు అరికట్టాలి

లంబాడీ న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు దేవానాయక్

మేడారం, సెప్టెంబరు 3: గిరిజన ప్రాంతాల ప్రజలను సీజనల్ వ్యాధుల నుంచి కాపాడలని లంబాడీ న్యాయవేదిక రాష్ట్ర అధ్యక్షుడు దారవత్ దేవానాయక్ ప్రకటనలో డిమాండ్ చేశారు. నిరుపేదలుగా ఏజెన్సీ గ్రామాల్లో నివసిస్తున్న గిరిజన, ఆదివాసీ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఆరోగ్య ఉపకేంద్రాలో 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

పడిగాపూర్, ఎలుబాక ప్రజలు అధైర్యపడొద్దు : కాంగ్రెస్

తాడ్వాయి, సెప్టెంబరు 3: మండలంలోని పడిగాపూర్, ఎలుబాక గ్రామాల ప్రజలు అధైర్యపడొద్దని, జంపన్నవాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పూనుకుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ తెలిపారు. మండలకేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఏనాడూ ప్రజలను పట్టించుకోలేదని విమర్శించారు. ఎలుబాక గ్రామ సమీపంలోని జంపన్నవాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ములుగు ఎమ్మెల్యే, రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ధనసరి సీతక్క చొరవతో నాలుగు నెలల క్రితమే ఎలుబాక వద్ద జంపన్నవాగుపై హైలెవల్ బ్రిడ్జి మంజూరైందని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తూ ప్రజలకు తప్పుడు సమాచారాన్ని ఇచ్చి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈసమావేశంలో నాయకులు పాక సాంబయ్య, ఎమ్డీ.ముజాఫర్ హుస్సేన్, రవి, యానాల సిద్దిరెడ్డి, రంగరబోయిన జగన్, తండాల శ్రీను, బండారి చంద్రయ్య, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బీజేపీ పరామర్శ

మహాముత్తారం, సెప్టెంబరు 3: మండలంలోని ఉట్లపల్లి గ్రామానికి చెందిన యువకుడు బీసుల లక్ష్మీరాజువిజయవాడ వరదల్లో గల్లంతు కావడంతో అతడి కుటుంబాన్ని బీజేపీ నాయకులు మంగళవారం పరామర్శించారు. ఈ విషయాన్ని పార్టీ అధినాయకత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని వారు భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు పూర్ణచందర్, నాయకులు సారయ్య, రాజు తదితరులు ఉన్నారు.